పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దేవరుప్పుల, ఏప్రిల్ 2 : సాగునీరందక పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని బీఆర్ఎస్ మండల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. దేవరుప్పుల, పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో బోర్లు ఎండి, సాగునీరు అందక రైతులు పెట్టిన వరి పంటలు పూర్తిగా ఎండాయని, ఎండిన పంటకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. దేవాదుల కాల్వల ద్వారా సాగునీరు అందక, భూగర్భజలాలు అడుగంటాయన్నారు. దీంతో చేతికి రావాల్సిన పంటలు ఎండిపోవడంతో రైతులు పశువులను మేపుతున్నారన్నారు. పంట నష్టంతో భారీగా పెట్టుబడులు కోల్పోయిన రైతులు మనోస్థైర్యాన్ని కోల్పోతున్నారని, వారికి తక్షణమే పంటపై ఆర్థిక సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింత రవి, కుతాటి నర్సింహులు, వంగ అర్జున్, గొడుగు మల్లికార్జున్, బొందుగుల సోమయ్య, మేడ సోమనర్సయ్య, శీల తిరుమలేశ్, రెడ్డిరాజుల అబ్బసాయిలు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా
- పీహెచ్‌సీలో తనిఖీ

పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

రఘునాథపల్లి, ఏప్రిల్ 2: వేసవి నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురైతే మెరుగైన వైద్యం అందించడంతోపాటు నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం దవాఖానలోని రికార్డులను పరిశీలించారు. పేషెంట్ల నమోదు, ఆసుపత్రిలో ప్రసవాలు, రక్త పరీక్షల తీరు, ఇతరత్రా అంశాలపై ఆయన వైద్య సిబ్బందిని అడిగారు. మరింత మెరుగైన సేవలను ప్రజలకు అందించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలు పెరిగేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయితీ స్థాయిలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. హీట్ స్ట్రోక్‌పై ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఔషధ నిల్వల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఓపీ సేవలు, రక్తపరీక్షలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, డాక్టర్లు మహేందర్, అశోక్‌కుమార్, కమలహాసన్, సుల్తానా రజియా, వైద్య సిబ్బంది బిక్కునాయక్, విష్ణువర్ధన్ రెడ్డి, పండరి, సంజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ కనకయ్య దంపతులు

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

జఫర్‌గఢ్, ఏప్రిల్ 2 : మండలంలోని ఉప్పుగల్లు ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, లక్ష్మీ దంపతుల కుమారుడు కొడారి లోకేశ్ స్మారకార్థం బుధవారం పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కొడారి లోకేశ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కనకయ్య మాట్లాడుతూ కృషి, పట్టుదలతో విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. చిన్నచిన్న సమస్యలతో అధైర్యానికి గురై ఆత్మహత్యలు చేసుకుని కన్నవారికి కడుపుకోత మిగుల్చొద్దన్నారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం కిషన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్‌లో అధికారుల తనిఖీలు

నిబంధనలు పాటించని పలు హోటల్స్‌కు జరిమానా

హోటల్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్‌తో పాటు హోటల్స్‌లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో పాటు ఆహార పరిరక్షణ అధికారి చేపూరి కృష్ణమూర్తి మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ లేనివారికి నోటీసులు జారీ చేశారు. ఆహార పరిశుభ్రత నిబంధనలు పాటించని 12హోటల్స్‌కు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు జరిమానా విధించారు. అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహించే ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, హోటల్స్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట, ఏప్రిల్ 2 : బీజేపీ మండల కమిటీని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యదర్శులుగా మినలాపురం జలందర్, కందుకూరి నవీన్, బీజేవైఎం అధ్యక్షుడిగా బంగారు మహేశ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా నీల కనకయ్య, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా సురేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బేజాడి సిద్ధులు, నాయకులు శీలంకోటి రాజు, నాయకులు సీతారాములు, గణేశ్, గద్ద రాజు, రాములు, రాజు, రాంబాబు, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, చంద్రమౌళి, సాయి, కిషన్, కరుణాకర్, కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నర్మెట, ఏప్రిల్ 2 : మండలంలోని బొమ్మకూర్, గండిరామవరం గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఐకేపీ ఏపీఎం మదారపు రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మల్కపేట, మచ్చుపహాడ్, అమ్మాపురం, వెల్దండ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

పోరాట యోధుడు సర్వాయి పాపన్న

- మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి
- పాపన్న వర్ధంతిలో వివిధ సంఘాల నాయకులు

పాలకుర్తిలో పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పాలకుర్తి, ఏప్రిల్ 2: బహుజనులకు రాజ్యాధికారం దక్కాలనే లక్ష్యంతో పోరాడిన యోధుడు సర్వాయి పాపన్న అని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో సర్వాయి పాపన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మూల వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ బహుజనులకు ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పేదలను సమీకరించి పోరాడిన బహుజన పోరాటయోధుడు పాపన్నగౌడ్ అని పేర్కొన్నారు. పాపన్న జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు అందించాలని కోరారు. పాపన్న విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంకుబండ్‌పై ప్రతిష్ఠించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఓబీసీసెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పులి గణేశ్‌గౌడ్, గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో-ఆర్డినేటర్ మొలుగూరి యాకయ్య, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరగాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు పోడిశెట్టి వెంకన్న, జిల్లా అధ్యక్షుడు తాళ్ల సోమనారాయణ, కళ్లెం పరశురాములు, మెరుగు ఉప్పలయ్య, బండి సోమయ్య, పూజరి నారాయణ, కుమారస్వామి, కమ్మగాని మహేశ్, మాజీ సర్పంచ్ చిట్యాల రామచంద్రం, గుమ్మడి రాజుల సాంబయ్య, కాటబత్తిని సోమన్న, అశోక్ పాల్గొన్నారు.

లింగాలఘనపురంలో..

లింగాలఘనపురం : సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం మండలంలోని నవాబుపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడజన ఐక్య సాధన సమితి నాయకులు పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని ఎంతగానో పోరాటం చేసిన మహానేతల్లో సర్వాయి పాపన్న అగ్రగణ్యుడన్నారు. తెలంగాణ శివాజీగా గుర్తింపు తెచ్చుకున్న నేత అని అభివర్ణించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద నర్సయ్యగౌడ్, నాయకులు నాగపురి రాముగౌడ్, మల్కపురం వెంకన్న, బాలుగౌడ్, రంగు వెంకటేశ్వర్లు, కోతి రవి, ఆకుల వంశీ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూరులో సర్వాయి పాపన్న విగ్రహానికి గౌడ సంఘం నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డం రాజు, యువజన సంఘం అధ్యక్షుడు మూల మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ బహుజనుల కోసం పోరాడిన పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇల్లందుల కుమార్, గౌడ సంఘం నాయకులు గడ్డం యుగేందర్, కోట రాజు, అశోక్, ఎల్లయ్య, నాగేశ్వర్, రాజయ్య, ప్రసాద్, సాయి, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

కొడకండ్లలో..

కొడకండ్ల : మండల కేంద్రంతోపాటు నర్సింగపురం, రామవరం, ఏడునూతులలో సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. నర్సింగపురంలో గౌడజన హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు దండెంపెల్లి సోమయ్య, గ్రామ అధ్యక్షుడు నూనెముంతల ఎల్లగౌడ్ ఆధ్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు దేశగాని సతీశ్, కప్పల శ్రీనివాస్, కప్పల రంగయ్య, పనస రాములు, పనస శ్రీనివాస్, నూనె ముంతల మురళీధర్, నూనెముంతల సోమనర్సయ్య, కప్పల నాగయ్య, ముత్యం యాకయ్య, ముత్యం వినోద్, పనస అంతయ్య, కొండ అంజయ్య, బూరుగు ఉప్పలయ్య, ముత్యం శ్రీకాంత్, పనస ఉప్పలయ్య, పనస మల్లయ్య పాల్గొన్నారు.

జనగామ రూరల్‌లో..

జనగామ రూరల్ : బహుజనుల రాజ్యం కోసం పోరాడి వీరుడు సర్వాయి పాపన్న అని గౌడ ఐక్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని పెంబర్తిలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పాలనలోనే సర్వాయి పాపన్న చరిత్రను గుర్తించి వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. ఖిలాషాపూర్‌లోని కోటను పునరుద్ధరణకు చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్యసాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు అంబాల ఆంజనేయులు గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, నాయకులు గోదల వంశీధర్‌రెడ్డి, నక్క కృష్ణ, మెరుగు రాజు, బైరు మహేందర్‌గౌడ్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, అంబాల సంపత్, దుర్గేష్, దుర్గాచలం, సోమనర్సింహాచారి, అంబాల శంకర్, శ్రీనివాస్, అయిల రాజు, ఆత్మకూరి భాను, సంకటి ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల : నివాళులర్పిస్తున్న గౌడ సంఘం సభ్యులు

లింగాలఘనపురం : నవాబుపేటలో పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జనగామ రూరల్ : పెంబర్తిలో పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

జఫర్‌గఢ్ : కూనూరులో పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

బండా ప్రకాశ్‌తో బీఆర్ఎస్ పెంబర్తి నాయకులు

క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

జనగామ రూరల్, ఏప్రిల్ 2: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని శాసమమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కోరారు. మండలంలోని పెంబర్తికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో బండా ప్రకాశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. బండా ప్రకాశ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నాయకులు బండ వెంకటేశం, సంకటి ఎల్లయ్య, చినబోయిన రాజు, బాలగాని నితిన్, కోల సందీప్ పాల్గొన్నారు.

తమ్మడపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న మొగులప్ప

ఉపాధి హామీ పనులు ఉదయమే చేయాలి

బచ్చన్నపేట, ఏప్రిల్ 2 : ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఉపాధి హామీ కూలీలు ఉదయమే పనికి రావాలని డీఆర్డీవో మొగులప్ప సూచించారు. మంగళవారం మండలంలోని తమ్మడపల్లిలో నర్సరీని, ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. మొగులప్ప మాట్లాడుతూ వర్షాలు పడేనాటికి నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను సిద్ధం చేయాలన్నారు. నర్సరీ నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం వచ్చేనాటికి నర్సరీల్లోని మొక్కలను పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామకృష్ణ, ఏపీవో కృష్ణ, టీఏ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఎస్సై

దేవరుప్పుల, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అందరూ నిబంధనలను పాటించాలని ఎస్సై చెన్నకేశవులు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అనుమతులు లేకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించొద్దన్నారు. మైకులు, డీజేలు వినియోగించొద్దన్నారు. రోడ్డుపై వాహనాల్లో వెళ్లే సమయంలో రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దన్నారు. ఒకవేళ ఎక్కువ తీసుకెళ్తే రుజువులుండాలన్నారు. లేకుంటే డబ్బులు సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై చెన్నకేశవులు తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించి పోలీసుశాఖకు సహకరించాలని ఆయన కోరారు.

స్థానికులకు అవకాశం కల్పించాలి

డీఎంహెచ్‌వో హరీశ్‌రాజుకు వినతి

డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 2 : సపోర్టింగ్ స్టాఫ్ నియామకాల్లో స్థానికులకే అవకాశం కల్పించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో హరీశ్‌రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు టీచింగ్ హాస్పిటల్స్‌లో స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, డ్రైవర్, బార్బర్, ఎలక్ట్రీషియన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు, శానిటేషన్ స్వీపర్ వంటి సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమిస్తున్నందున స్థానికులకే అవకాశం కల్పించాలని యూనియన్ సెక్రటరీ బైరపాక శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితో పాటు మాతా శిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో కొన్నేళ్ల నుంచి తక్కువ వేతనంతో వివిధ కేటగిరిల్లో పనిచేస్తున్న సిబ్బందిని, మెడికల్ కళాశాల, టీచింగ్ ఆసుపత్రుల్లో సపోర్టింగ్ స్టాఫ్‌గా సర్దుబాటు చేయాలని సూచించారు. మిగిలిన పోస్టులకు కొత్తవారిని ఎంపిక చేయాలని ఆయన కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిరుద్యోగులపై ప్రభుత్వం కరుణ చూపాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపర్తి రాజు, రాజేశ్, ఐలేశ్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఎంపీడీవో శ్రీనివాస్

రఘునాథపల్లి, ఏప్రిల్ 2: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని శివాజీనగర్‌లో మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దన్నారు. మద్దతు ధరను కల్పించేందుకే గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ధాన్యాన్ని ఆరబెట్టడంతోపాటు తూర్పారపట్టి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. ధాన్యం ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ.2203, బీ గ్రేడ్‌కు రూ.1883 మద్దతు ధర కు అందిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేశాక వారం రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులను జమచేసేందుకు చర్యలు తీసుంటున్నామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సారయ్య, సీసీ సంపత్, రీనవతి, వీవోఏ రాజేశ్వరి, కమిటీ సభ్యులు శోభ, కావ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తరిగొప్పలలో..

తరిగొప్పుల : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కరాజుపల్లి, అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, పోతారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రలను ఆయన ప్రారంభించారు. దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో విజయ, ఏఈవో జయశ్రీ, యాదగిరి, రాములు, గ్రామ కార్యదర్శి అమరేందర్, మౌనిక, రేణుక, అంకంరాజు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

తరిగొప్పుల : అక్కరాజుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

కేయూలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మ దహనం

కేయూ మొదటి గేటు వద్ద కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2: కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మందా నరేశ్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడారు. కడియం శ్రీహరి దళిత నాయకత్వాన్ని అణచివేస్తూ వారి త్యాగాల పునాదుల మీద వివిధ పార్టీల నుంచి టికెట్ తెచ్చుకుంటూ గెలుస్తూ పదవులు అనుభవిస్తూ అవకాశవాద రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుతున్నారన్నారు. ఏ పార్టీలో ఉన్నా దళితులను భూస్థాపి తం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నాడని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీహరి కూతురు కావ్యను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. వరంగల్ పార్లమెంట్ టికెట్ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ పునరాలోచించి ఆ సీటును మాదిగలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తన నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మచ్చ పవన్ కల్యాణ్, కుమ్మరి శ్రీనాథ్, జూపాక చరణ్, ఎల్తూరి సాయి కుమార్, ఓదెల అరిస్టాటిల్, జీవన్, వివేక్ పాల్గొన్నారు.

మట్టి కూలి బావిలో కూరుకుపోయిన రైతులు

స్వల్ప గాయాలతో బయటకు..

మట్టిలో కూరుకపోయిన రైతులు

కేసముద్రం, ఏప్రిల్ 2 : కొత్త బావి తవ్వే క్రమంలో పైనుంచి మట్టి కూలి ఇద్దరు రైతు లు మట్టిలో ఇరుక్కుపోయారు. తోటి రైతు ల సహాయంతో స్వల్ప గాయాలతో బయ టపడ్డారు. ఈ ఘటన కేసముద్రం మండ లంలోని గాంధీ పురం గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కేసముద్రం మండలం తాళ్లపూస పల్లి గ్రామానికి చెందిన పోతకం సుధాకర్ అనే రైతు గాంధీపురం శివారులోని తన వ్యవసాయ భూమిలో ఎక్స్‌కవేటర్ సాయంతో బావి తవ్విస్తున్నాడు. సుమారు 20 ఫీట్ల మేర లోతు తీసిన తర్వాత బండ వచ్చే అవకాశమున్నదని ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ చెప్పాడు. ఈ మేరకు బావి లోపల పరిశీలించేందుకు పెద్దమోరితండాకు చెందిన మరో రైతు నరేశ్‌తో కలిసి సుధాకర్ లోపలికి దిగారు. ఈ క్రమంలో పై నుంచి భూమి(దరి) కూలి లోపల ఉన్న సుధాకర్, నరేశ్‌పై పడింది. సుధాకర్ ఛాతీ వరకు మట్టి పడగా, నరేశ్‌కు నడుం వరకు మట్టి పడింది. అదే సమయంలో పక్కనే ఉన్న కొంతమంది రైతులు వచ్చి వారిద్దరిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. మట్టిని తొలగించేందుకు చాలా కష్టపడ్డారు. పై నుంచి మట్టి పడే అవకాశం ఉండడంతో ఇరుక్కపోయిన సుధాకర్, నరేశ్ బిక్కు బిక్కుమంటూ ఉండిపోయారు. ఆ తర్వాత తోటి రైతుల సాయంతో బయటకు వచ్చిన సుధాకర్, నరేశ్‌కు గాయాలు కాగా, చికిత్స కోసం మహబూబాబాద్ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై వంశీధర్ పరిశీలించారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో లోతు ఎక్కువగా తీసి వెడల్పు తీయకపోవడం వల్లే ఇలా జరిగిందని రైతులు చర్చించుకుంటున్నారు.

క్రేన్ డబ్బా పడి ఒకరి మృతి

నర్సింహులపేట, ఏప్రిల్ 2 : క్రేన్ వైరు తెగి డబ్బా మీదపడి ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నర్సింహపురం బంజర గ్రామ పంచాయతీ పరిధిలోని బయ్య వెంకన్న బావిలో పూడిక తీస్తుండగా క్రేన్ వైరు తెగిపోవడంతో మట్టితో ఉన్న డబ్బా బావిలో ఉన్న గుగులోత్ రవి(40)పై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బానోత్ బిచ్చాకు గాయాలయ్యాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేసవి యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్‌బాషా

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 2 : వేస